వైభవంగా ముగిసిన మహా శివరాత్రి వేడుకలు


న్యూ అశోక్ నగర్‌లోని కాశీ విశ్వేశ్వర దేవాలయంలో అన్నదాన కార్యక్రమం

బౌద్ధనగర్: పార్సిగుట్ట న్యూ అశోక్ నగర్‌లోని కాశీ విశ్వేశ్వర దేవాలయంలో మహా శివరాత్రి వేడుకలు గురువారం వైభవంగా ముగిశాయి. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ ఇంచార్జి మృత్యుంజయ, పద్మశాలి సంఘం అధ్యక్షుడు బొమ్మ నరేందర్, రమేష్, పద్మ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

లాలాపేటలో అన్నదానం



లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలో గురువారం అమావాస్యను పురస్కరించుకుని లాలాపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీ మాతకు ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో లాలాపేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మడిపడగ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పందిరి సాంబశివరావు, కోశాధికారి యెని శెట్టి భాస్కర్ తదితరులున్నారు.

గాంధీ ఆస్పత్రిలో..


నిరుపేదలకు అన్నదానం చేస్తున్న ట్రూ లవ్ ఆఫ్ గాడ్ ట్రస్ట్ ప్రతినిధులు


గాంధీఆస్పత్రి : ట్రూ లవ్ ఆఫ్ గాడ్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ఎదుట గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 200 మందికి ఆహార పదార్థాలను అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రెసిడెంట్ అనపర్తి ప్రభుదేవ, ప్రతినిధులు దాసు, శివానీ, నాగేష్, పాస్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన వైజ్ఞానిక ప్రదర్శన



లాలాపేట: సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని తార్నాకలోని నారాయణ స్కూల్‌లో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన ఆలోచింపజేసింది. పీపీ1 విద్యార్థులు వివిధ రకాల నమూనాలు, మోడల్స్‌ను తయారు చేసి ఈ కార్యక్రమంలో ప్రదర్శించారు. ప్రధానంగా సైన్స్, పర్యావరణ పరిరక్షణ, వివిధ రకాలైన రంగులు వంటి మోడల్స్ ఆకట్టుకున్నాయి.

యువతి అదృశ్యం


జ్యోతి

బన్సీలాల్‌పేట్: ఇంటి నుంచి మార్కెట్‌కు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైంది. ఈ సంఘటన గాంధీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన మేరకు.. న్యూబోయిగూడ ప్రాంతానికి చెందిన సురభి కుమార్తె జ్యోతి(19) అదృశ్యమైంది. ఇంటి నుంచి పండ్ల కోసం బయటకు వెళ్లిన జ్యోతి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు బంధువులు, తెలిసిన వారి ఇళ్లల్లో వెతికినా ఫలితం లేకుండా పొయింది. దీంతో తల్లి సురభి గాంధీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.

యువకుడి అదృశ్యం


విక్రమ్

చిలకలగూడ : ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపిన మేరకు.. సీతాఫల్‌మండి డివిజన్ బాపనబస్తీకి చెందిన విక్రమ్ (27) కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. సోమవారం బయటకు వెళ్లిన విక్రమ్ తిరిగి రాలేదు. సన్నిహితులు, బంధుమిత్రులను వాకబు చేసినా ఫలితం లేకపోయింది. తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని అడ్మిన్ ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు.

జోరుగా అక్రమ నిర్మాణాలు!

- డొమెస్టిక్ నిర్మాణాల పేరిట కమర్షియల్ నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు


జనవాసాల మధ్య ఉన్న కమర్షియల్ నిర్మాణాలు వద్దని నిరసన వ్యక్తం చేస్తున్న తార్నాక కాలనీ వాసులు (ఫైల్)

లాలాపేట: తార్నాక డివిజన్‌లో కొంత కాలంగా అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. కొందరు డొమెస్టిక్ పర్మిషన్లు (నివాసం కోసం) తీసుకొని కమర్షియల్, బహుళ అంతస్తుల నిర్మాణాలు చేస్తూ జీహెచ్‌ఎంసీ ఆదాయానికి గండికొడుతున్నారు. ఇదంతా తెలిసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా తార్నాక, లాలాపేట ప్రాంతాల్లో నిబంధనలకు ఉల్లంఘిస్తూ అధిక సంఖ్యలో నిర్మాణాలు కొనసాగుతున్నాయి. అక్రమ నిర్మాణాలను కట్టడి చేయాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీన్ని ఆసరాగా తీసుకున్న భవన నిర్మాణదారులు, 30, 40 గజాల స్థలంలో సైతం పరిమితికి మించి నిర్మాణాలు చేపడుతున్నారు. ఇలాంటి అక్రమ నిర్మాణాలు నిర్మాణ దశలోనే కూలిపోయి ప్రమాదాలు సైతం చోటు చేసుకున్న సంఘటనలు తార్నాక, లాలాపేటలో గతంలో ఉన్నాయి. ఇలాంటి ప్రమాద సంఘటనలతో కొందరు కార్మికులు ప్రాణాలు సైతం కోల్పోయారు. అయినా టౌన్ ప్లానింగ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు వాపోతున్నారు.

జనవాసాల మధ్య పార్కింగ్ సమస్య

కాలనీల్లో, బస్తీల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార సముదాయాలను ఏర్పాటు చేయడం వలన అక్కడికి వచ్చే వారికి పార్కింగ్ సదుపాయం కల్పించడం లేదు. దీంతో భవిష్యత్‌లో ఆయా ప్రాంతాల్లో పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలు తలెత్త అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తార్నాకలోని బ్యాంక్ ఆఫ్ బరోడా వద్ద, లాలాపేటలో మజీద్ ఎదురుగా, లాలాపేట ఫ్లై ఓవర్ పక్కన, శాంతినగర్ నుంచి ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్‌కు వెళ్లే మార్గంలో అక్రమ నిర్మాణాలు జోరుగా నిర్మిస్తున్నారు. ఇలా జీహెచ్‌ఎంసీకి రావాల్సిన ఆదాయానికి అధికారులు, సిబ్బంది, భవన నిర్మాణదారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై గండికొడుతున్నారు. కార్మికుల ప్రాణాలకు లెక్కలేకుండా పోయింది.

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు

జనవాసాల మధ్య వ్యాపార కార్యకలాపాలను నిర్వహించడం వలన పార్కింగ్ సమస్యతో పాటు అనేక ఇబ్బందులు ఎదురవుతాయని తార్నాక వాసులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఇటీవల ఓ నిర్మాణం వద్ద పలువురు నిరసన తెలియజేశారు. ఈ విషయమై సికింద్రాబాద్ డిప్యూటీ కమిషనర్‌కు, జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదనీ స్థానికులు రవీందర్‌రెడ్డి, ఉపేందర్ పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బడ్జెట్‌లో విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలి


సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న తల్లుల సంఘం నాయకులు

అడ్డగుట్ట: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలని తెలంగాణ తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్ భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. అడ్డగుట్టలోని బాబు జగ్జీవన్‌రామ్ భవనంలో గురువారం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలలో విద్యకు రాష్ట్ర బడ్జెట్‌లో కేవలం 6.6 శాతం మాత్రమే కేటాయించారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం 15 శాతం బడ్జెట్‌ను కేటాయిస్తామని హామీ ఇచ్చినప్పటికీ తొలి బడ్జెట్‌లో కేవలం 7.6 శాతం మాత్రమే కేటాయించిందని తెలిపారు. తక్కువ నిధుల కేటాయింపు కారణంగా విద్యా ప్రమాణాలు మరింత దిగజారుతున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, రమా, జమునా, శోభ, పుష్ప పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలి


సమావేశంలో పాల్గొన్న ఏఐసీసీ సభ్యురాలు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమ

సనత్‌నగర్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. బేగంపేటలో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా గత సమీక్షా సమావేశంలో చర్చకు వచ్చిన సమస్యల పరిష్కారం ఏమేరకు జరిగిందో చర్చించారు. పరిష్కారం కాని సమస్యలను అధికారులకు ఫోన్ చేసి వారి దృష్టికి తీసుకువెళ్లి వెనువెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు విశాల్ సూదం, రమేష్, సలీంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: జనప్రియా, గ్రీన్‌ల్యాండ్స్ సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వెంకట్ ప్లాజా, ఒర్రా జ్యువెలర్స్, కృష్ణా జ్యువెలర్స్, ఎక్సైడ్ బ్యాటరీ లేన్, పోచమ్మ బస్తీ, పంజగుట్ట, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మూసాపేట హెచ్‌పీరోడ్డు, లక్ష్మీకళ థియేటర్ ఏరియా, శ్రీరాములు థియేటర్ ఏరియా, అశ్వని హెయిర్ ఆయిల్ లేన్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

రసూల్‌పురా : మరమ్మతు పనుల కారణంగా పోలీస్ లైన్స్ 11 కేవీ ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సికింద్రాబాద్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ మురళీ కృష్ణ తెలిపారు. బేగంపేట ట్రాఫిక్ పోలీస్, ఎస్‌పీ రోడ్, హాకీ స్టేడియం, రసూల్‌పురా ఉషా గోడౌన్స్, జగదీష్‌నగర్, శ్రీలంక బస్తీ, ఇంద్రమ్మ నగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు.

- మడ్‌ఫోర్ట్ 11 కేవీ ఫీడర్ పరిధిలో మడ్‌ఫోర్ట్, కంటోన్మెంట్ వర్క్‌షాపు, కార్డ్ మాస్టర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు.
- రవికాలనీ 11 కేవీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు రవి కాలనీ, ధనలక్ష్మి కాలనీ, వైజయంతి కాలనీ పరిసర ప్రాంతాల్లో..
- విక్రంపురి 11 కేవీ ఫీడర్ పరిధిలో గస్‌రాక్, జనక్‌పురి, పీఅండ్‌టీ కాలనీ, ఏపీ టెక్స్ బుక్ కాలనీ, కార్ఖాన, అస్‌బెస్టాస్ కాలనీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు..
- మహేంద్రహిల్స్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని అర్చన ఎన్‌క్లేవ్, వాల్మీకినగర్, గాంధీనగర్, శేషాచల కాలనీ, సెకండ్ లక్ష్మినగర్, సంజీవయ్య హౌసింగ్ సొసైటీ, తిరుమల కాలనీ, పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

రైతుల సంక్షేమాన్ని విస్మరించడం బాధాకరం

సుందరయ్య విజ్ఞానకేంద్రం: మానవ మనుగడకు.. దేశ అభ్యున్నతికి జీవనాధారమైన దేశీయ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించకుండా కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ రైతుల సంక్షేమాన్ని విస్మరించడం అత్యంత బాధాకరమని తెలంగాణ రైతు సంఘం కార్యదర్శి టి.సాగర్ అన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో అఖిల భారత రైతు సమాఖ్య, అఖిల భారత వ్యవసాయ సమాఖ్య ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ... వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 20శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. నూటికి 70శాతం మంది ప్రజలు వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నప్పటికీ ప్రభుత్వాలు వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేయకపోవడం బాధాకరం అన్నారు. రైతుల భూములను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే విధంగా చట్టాలు రూపొందించేందుకు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. దేశీయ రైతుల వ్యవసాయానికి ప్రోత్సహకాలు ప్రకటించకుండా కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించే విధంగా రాయితీలు, సబ్సిడీలు మాఫీ చేస్తున్నారని అన్నారు.

ఈ క్రమంలో రైతుల ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. దీంతో వారి కుటుంబాలు దిక్కులేని స్థితిలో ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్, ఏఐకేఎంఎస్ కార్యదర్శి మండల వెంకన్న, రైతాంగ సమితి అధ్యక్షుడు జక్కుల వెంకటయ్య, వివిధ సంఘాల నాయకులు కాంతయ్య, గోనే కుమారస్వామి, బుర్రి ప్రసాద్, తదితరులు పాల్గొని ప్రసంగించారు.

హాస్టళ్లలో భద్రతా ప్రమాణాలు పాటించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని పీజీ విద్యార్థుల గోదావరి హాస్టల్ కుక్ జంపయ్య గురువారం వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని గాయపడ్డారు. దీంతో జంపయ్యకు మెరుగైన వైద్యం అందించాలని పీడీఎస్‌యూ నాయకులు షేక్ ఆసిఫ్ చీఫ్ వార్డెన్ డా.కొర్రెముల శ్రీనివాస్‌రావును కోరారు. హాస్టళ్లలోని వంటశాలలో భద్రతా ప్రమాణాలు పాటించాలని కోరారు. విద్యార్థుల సంఖ్యను బట్టి వర్కర్స్ సంఖ్యను పెంచాలని కోరారు.

3నుంచి అందుబాటులోకి ఓయూ స్విమ్మింగ్ పూల్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఈ నెల 3 నుంచి స్విమ్మింగ్‌పూల్ అందుబాటులో ఉంటుందని ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొ.రాజేష్‌కుమార్ గురువారం తెలిపారు. ఓయూ విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగుల కుటుంబాలు వినియోగించుకోవచ్చునన్నారు. ఇందుకు సంబంధించి దరఖాస్తులు స్విమ్మింగ్‌పూల్ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు.

మట్టికుప్పల తొలగింపు

సుందరయ్య విజ్ఞానకేంద్రం: రాంనగర్ డివిజన్‌లోని నెహ్రూనగర్‌లో కొంతకాలంగా పేరుకుపోయిన మట్టికుప్పలను తొలగించాలని స్థానికులు ఎమ్మెల్యే ముఠాగోపాల్‌ను కోరారు. ఈ మేరకు ఆయన గురువారం జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడి మట్టికుప్పలను తొలగించారు. సమస్య పరిష్కారం కావడంతో బస్తీవాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ముఠా జైసింహ, శంకర్‌ముదిరాజ్, కళ్యాణ్‌నాయక్, ప్రేమ్‌కుమార్ ముదిరాజ్, రాజు, సందీప్, చైతన్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వర్సిటీలలో ప్రవేశ నిబంధనలు మార్చండి

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణలోని వివిధ వర్సిటీలలో ప్రవేశ నిబంధనలలో మార్పు చేయాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ (టీజీవీపీ) రాష్ట్ర అధ్యక్షులు నక్క శ్రీశైలం యాదవ్ గురువారం డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం హైదరాబాద్ ఉమ్మడి రాష్ట్ర రాజధానిగా కొనసాగుతూ వర్సిటీల ప్రవేశాలకు 15 శాతం (ఓపెన్ టు ఆల్) సీట్లలో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు కూడ అడ్మిషన్లు పొందారని పేర్కొన్నారు. గత ఏడాది జూన్ నాటికి పదేళ్లు ముగిసినా ఇంత వరకు ప్రభుత్వం కొత్త నిబంధనలు రూపొందించనందున పాత పద్ధతిలోనే ప్రవేశాలు జరుగుతున్నాయన్నారు. ఏపీలో కొత్త నిబంధనలతో ప్రవేశాలు జరుగుతుండగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పాత పద్ధతిని కొనసాగించడం వలన విద్యార్థులు నష్టపోతున్నారని పేర్కొన్నారు.

కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా.13, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 19, బెండకాయ 40, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 15, క్యాప్సికమ్ 35, పచ్చకాకర 35, పందిరి బీర 40, క్యాబేజీ 8, క్యారెట్ 18, దొండ 45, గుండుబీన్స్ 35, గింజ చిక్కుడు 50, కీర 18, దోసకాయ 28, ఉల్లిగడ్డ 32, చామగడ్డ 43, పొట్లకాయ 15, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

సనత్‌నగర్: శంకర్ నేత్రాలయం, సంకేత్ ఆర్గనైజేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ సనత్‌నగర్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత నేత్ర చికిత్స శిబిరం నిర్వహించనున్నారు. సనత్‌నగర్ మీ–సేవా సమీపంలో కూరగాయల మార్కెట్ వెనుక ఉన్న పార్కు–19 ఆవరణలో ఈ శిబిరం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యుడు డాక్టర్ రవీందర్‌గౌడ్ కంటి పరీక్షలు చేస్తారన్నారు. అవసరమైన వారికి కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.


అభివృద్ధి విషయంలో రాజీపడేది లేదు


రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి

కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి

సనత్‌నగర్: అభివృద్ధి పనుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. సనత్‌నగర్ డివిజన్ పరిధిలోని జెక్‌కాలనీలో సాయిదర్శిని హోటల్ నుంచి అనంత రెడ్డి ఇంటి వరకు రూ.58 లక్షల వ్యయంతో, సనత్ నగర్ బస్టాండ్‌లోని పరాషా హోటల్ పక్కన రూ.19.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న రోడ్డు నిర్మాణ పనులను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సనత్‌నగర్ నియోజకవర్గాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ రోల్ మోడల్‌గా తీర్చిదిద్దారన్నారు. అందులో భాగంగా సనత్‌నగర్ డివిజన్‌ను ఒక ఆణిముత్యంలా మార్చారన్నారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులను చేపడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఈ జమీన్‌బాషా, భాస్కర్, జెక్‌కాలనీ అధ్యక్షులు మల్లు ప్రసాద్, అనంతరెడ్డి, మల్లారెడ్డి, చందు, బీఆరెస్ నాయకులు బాల్‌రెడ్డి, మీర్జా ఖలీల్‌బేగ్, షౌకత్, రాజు, వసీం, ఇబ్రహీం, పురుషోత్తం, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం


శివపార్వతుల కల్యాణ మహోత్సవం..

సనత్‌నగర్: హనుమాన్ దేవస్థానంలోని మల్లికార్జునస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం కన్నులపండువగా జరిగింది. వేలాది మంది భక్తుల మధ్య వేడుకలు జరిగాయి. ఈఓ సత్యనారాయణ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు రిపుంజయశర్మ ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం అనంతరం మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా రుద్ర హోమం, పూర్ణాహుతి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

వైభవంగా శివరాత్రి మహోత్సవాలు..


బహుమతులు అందుకున్న చిన్నారులతో అతిథులు

సనత్‌నగర్: బేగంపేట ప్రకాష్‌నగర్ శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా శ్రీదత్త కూచిపూడి నాట్య కళాక్షేత్రం వారి నాట్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. నంది అవార్డు గ్రహీత, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ గ్రహీత పావని మఠం ఆధ్వర్యంలో జరిగిన నృత్య ప్రదర్శనను భక్తులు తిలకించి కరతాళ ధ్వనులతో హర్షం వ్యక్తం చేశారు. ఈ వేడుకల్లో గద్వాల్ అడిషనల్ ఎస్పీ సాంబయ్య, బేగంపేట ఇన్‌స్పెక్టర్ రామయ్య, డీఐ మధుకర్, ఎస్‌ఐ వరలక్ష్మీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై సందేహాలా..?

- ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రత్యేక వెబ్‌సైట్
- ఆన్‌లైన్‌లో ఫిర్యాదుకు అవకాశం
- ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో రోజూ వందల్లో ఫిర్యాదులు

బంజారాహిల్స్: అర్హులైన నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తీసుకువచ్చింది. ఏడాది క్రితం ప్రజాపాలన కింద దరఖాస్తులు స్వీకరించగా సర్వే నిర్వహించి లబ్ధిదారులను గుర్తించారు. అయితే జాబితాలో పేర్లు లేని వారి కోసం మళ్లీ దరఖాస్తులు తీసుకుంటున్నారు. అయితే సర్వే సమయంలో పలువురు దరఖాస్తుదారులు అందుబాటులో లేకపోవడంతో సిబ్బంది ఏ విధంగా నమోదు చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో తమ దరఖాస్తు పరిస్థితి ఏమిటో సమాచారం తెలియక చాలా మంది ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అటు జీహెచ్‌ఎంసీ కార్యాలయానికి ఇటు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ, ఇంకోవైపు కలెక్టర్ ప్రజావాణి, మరోవైపు ప్రజాభవన్‌లో ప్రతి మంగళ, శుక్రవారాల్లో జరిగే ప్రజావాణిలోనూ పెద్ద ఎత్తున దరఖాస్తులు అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం దరఖాస్తు స్థితి తెలుసుకునేందుకు సర్వే నిర్వహణపై ఫిర్యాదులకు అవకాశం కల్పించారు. ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్లు, జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధి కిందికి వచ్చే షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, వెంగళరావు నగర్, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్ల పరిధిలో సర్వే నిర్వహణపై ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. సర్వేపై సందేహాలు ఉంటే ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేసేందుకు ఈ అవకాశం కల్పించారు. దీంతో ఈ రెండు నియోజకవర్గాల పరిధిలో రోజూ 150కి పైగా ఫిర్యాదులు అందుతున్నాయి. వాటికి సమాధానం చెప్పేందుకు అధికారులు ఆన్‌లైన్‌లో జాబితాను రూపొందిస్తున్నారు.


ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేస్తున్న అధికారులు..(ఫైల్)

సంతృప్తి చెందకపోతే..

- ఇందిరమ్మ ఇళ్ల సర్వే వివరాల నమోదుపై సంతృప్తి చెందకపోతే ఫిర్యాదు చేసుకునే సదుపాయం ఉంటుంది. దీనికి ఫిర్యాదులపై క్లిక్ చేసి మన మొబైల్ నెంబర్ టైప్ చేయగానే ఓటీపీ వస్తుంది.
- ఓటీపీ ఎంటర్ చేయగానే ఫిర్యాదు పేజీ ఓపెన్ అవుతుంది.
- మన ఆధార్ నెంబర్ నమోదు చేయగానే పలు వ్యక్తిగత వివరాలు, చిరునామా నమోదవుతాయి.
- ఫిర్యాదుల కేటగిరి ఎంచుకోగానే కింద ఐచ్ఛికలు కనిపిస్తాయి.
- సర్వేయర్ సందర్శించలేదు, సంతృప్తి చెందలేదు, సర్వే సక్రమంగా జరగలేదు, సర్వే సమయంలో గైర్హాజర్ అయ్యారు, ప్రజాపాలనలో దరఖాస్తు చేయలేదు, మధ్యవర్తితో సమస్యలు, డబ్బులు డిమాండ్ చేస్తున్న సర్వేయర్.. వీటిలో దరఖాస్తుదారుడు ఎదుర్కొన్న సమస్యను ఎంచుకుని ఫిర్యాదు వివరాలు రాయాల్సి ఉంటుంది.
- అనంతరం ఏదేని ధ్రువపత్రాన్ని అప్‌లోడ్ చేసి సబ్మిట్‌పై నొక్కాలి.
- వెంటనే మొబైల్ ఫోన్‌కు ఫిర్యాదు నెంబర్ వస్తుంది. కొద్ది రోజుల తర్వాత ఫిర్యాదు వివరాలు తెలుసుకోవచ్చు.

దరఖాస్తు స్థితి ఇలా తెలుసుకోవచ్చు..

గూగుల్‌లో https://indirammaindlu.telangana.gov.inవెబ్‌సైట్‌ను నమోదు చేయగానే ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించిన పేజీ ఓపెన్ అవుతుంది. అందులో అప్లికేషన్ సెర్చ్‌ను ఎంపిక చేసుకోవాలి. మొబైల్ నెంబర్, ఆధార్‌కార్డు, అప్లికేషన్ ఐడీ, రేషన్‌కార్డు అంశాల్లో ఏదో ఒక వివరాలు నమోదు చేయగానే మన అప్లికేషన్ వివరాలు ప్రత్యక్షమవుతాయి. సర్వే స్థితి, అది ఏ పరిస్థితిలో ఉందో గమనించవచ్చు.